# ఓ కవి మరణం

సింగిల్ పేజీ కథ

ఎ.రజా హుస్సేన్



వరహాల్రాజు మంచి కవి. పేరులో వరహాలున్నా జీవితంలో మాత్రం దరిద్రమే. కవిత్వం కూడు పెట్టకపోయేసరికి జీవితాంతం తోడుగా వుంటానని అగ్నిసాక్షిగా ఏడడుగులు వేసిన భార్య కాస్తా గడపదాటి వెళ్లిపోయింది. వరహాల్రాజుకు మిగిలిన ఆస్తంటూ ఏమీలేదు. అప్పుడప్పుడూ తాను రాసిన కథలు తప్ప. పత్రికలకు పంపిన కథలు తిరుగుటపాలో తిరిగొచ్చేవి. వరహాల్రాజుకేం పాలుపోలేదు. పత్రికల్లో వచ్చే కథల్తో పోలిస్తే తన కథలు అద్భుతంగా వున్నాయి. అయినా పత్రికలవాళ్లు ఎందుకు ప్రచురించడం లేదో అర్థంకాలేదు.

ఈ మధ్య వరహాల్రాజు పాత స్నేహితుడొకడు సిటీబస్‌లో కలిశాడు. పాత స్నేహితుడ్ని చూడగానే వరహాల్రాజు చాలా సంతోషించాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నాక కాఫీ తాగుదామని ఇరానీ హోటల్‌కు వెళ్లారు. చాయ్, బిస్కెట్లకు ఆర్డర్ ఇచ్చారు. అన్నట్టు నువ్వేం చేస్తున్నావని అడిగాడు వరహాల్రాజు తన ఫ్రెండ్‌ను 'అదేమిట్రా రసికరాజు పేరు నువ్వు వినలేదా! ఈ రోజు ఏ పత్రికలో చూసినా రసికరాజు పేరుతో కథలు, నవలలు కనిపిస్తాయి కదా!' అన్నాడు. నేను నీ గురించి అడిగితే 'రసికరాజు గురించి చెప్తొంవేంటని?' అడిగాడు వరహాల్రాజు. ఒరేయ్ బుద్ధూ చంటిగాడనబడే వీడే 'రసికరాజు' అన్నాడు. అంటే పత్రిక మధ్య పేజీల్లో వచ్చే బూతు, పచ్చి శృంగార కథలన్నీ నీవేనా? అన్నాడు వరహాల్రాజు. 'నిరభ్యంతరంగా' నావే! ఏం నీకేమైనా అనుమానం వుందా! వుంటే పత్రిక ఎడిటర్లకు రాసి కనుక్కో అన్నాడు నవ్వుతూ 'రసికరాజు'. వరహాల్రాజుకు పిచ్చెక్కినంత పనైంది. తాను సామాజిక సమస్యల్ని ఇతివృత్తాలుగా తీసుకుని సహజ సంఘటనలతో కథలురాస్తే ప్రచురించని పత్రికలవాళ్లు రసికరాజుకు ఎందుకింత ప్రాధాన్యతనిస్తున్నారో వరహాల్రాజుకు అర్థంకాలేదు. ఆ విషయాన్నే రసికరాజును అడిగేశాడు. దానికి రసికరాజు నవ్వుతూ ఒరేయ్ ఫూల్ కథలో ఎంత దమ్ముందన్నది కాదు. ఎడిటోరియల్ స్టాఫ్‌కు ఎంత స్టఫ్ ఇస్తున్నామన్నది ముఖ్యం. వారానికి ఒకటో రెండో సార్లయినా సిట్టింగ్‌లు వేయాలి. వాళ్లను సంతోషపరచాలి. ఇక పాఠకులదేముంది? శృంగారాన్ని ఒలికిస్తే చొంగకార్చుకుంటూ చదువుతారు. ఈ రోజుల్లో రచయితలో సరుకు లేకపోయినా పెన్నులో ఇంకువుంటే చాలు .. మన సరుకు ఎంత చెత్తదయినా దాన్ని ప్రమోషన్ చేసుకునే తెలివుండాలి... అంటూ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు. రసికరాజు మాటలు వింటున్నాడే కానీ వరహాల్రాజుకు అవేం బుర్రకెక్కినట్టు లేదు. ఏదైతేనేం రసికరాజు ఇప్పించిన బిస్కట్లతో టీతో ఆ రోజు గడిచిపోయింది వరహాల్రాజుకు. రసికరాజు తన చేతిలో వున్న 'భ్రాంతి' తాజా వారపత్రికను వరహాల్రాజుకిచ్చి అందులో తన కథ వుంది చదవమని చెప్పాడు.

వరహాల్రాజుకు 'భ్రాంతి' వారపత్రిక తెరిచేసరికి మొదటి పేజీలో ఓ ప్రకటన కంటపడింది. ఉత్తమ కథలపోటీకి సంబంధించిన ప్రకటన అది. ఈ పోటీలో ఎంపికైన ఉత్తమ కథకు 50 వేల రూపాయలు బహుమానం ఇస్తామని పత్రికా యాజమాన్యం ప్రకటించింది. వరహాల్రాజుకెందుకో ఈ పోటీలో పాల్గొనాలనిపించింది. ఇతివృత్తం సమాజానికి దగ్గరగా వుండాలని, వాస్తవ సంఘటనల్ని ప్రతిబింబించాలని యాజమాన్యం నిబంధన విధించింది. వరహాల్రాజు కథ గురించి ఒక్కరోజల్లా ఆలోచించాడు. చివరకు రసికరాజు, వరహాల్రాజు మధ్య జరిగిన సంఘటనను నేపథ్యంగా తీసుకొని కథ రాసి పత్రికకు పంపాడు.

ముందుగా ప్రకటించినట్టే అనుకున్న తేదీకి ఉత్తమకథలకు బహుమతులు ప్రకటించారు. వరహాల్రాజు పంపిన కథ 'ఓ కవి మరణానికి మొదటి బహుమతి వచ్చింది. రసికరాజు తన మిత్రుడికి ఈ వార్తను చెబుదామని వరహాల్రాజు ఇంటికొచ్చి తలుపు తట్టాడు. ఎంతకూ తలుపు తీయకపోయేసరికి రసికరాజు తలుపులు బద్దలు కొట్టాడు. వరహాల్రాజు తాటి చాపపై ఊపిరిలేకుండా పడున్నాడు. పక్కనే ఓ కాయితంపై ఇలా రాసివుంది.

"నా కథకు గనక బహుమతి వస్తే అందులో నా అంత్యక్రియలకు పోను మిగతా సొమ్మును నా లాంటి దిక్కులేని అభాగ్యకవుల రచనలకు పారితోషికంగా అందచేయండి ఇదే నా వీలునామా". •

*వరహాల్రాజుకు 'భ్రాంతి' వారపత్రిక తెరిచేసరికి మొదటి పేజీలో ఓ ప్రకటన కంటపడింది. ఉత్తమ కథలపోటీకి సంబంధించిన ప్రకటన అది. ఈ పోటీలో ఎంపికైన ఉత్తమ కథకు 50 వేల రూపాయలు బహుమానం ఇస్తామని పత్రికా యాజమాన్యం ప్రకటించింది. వరహాల్రాజుకెందుకో ఈ పోటీలో పాల్గొనాలనిపించింది. ఇతివృత్తం సమాజానికి దగ్గరగా వుండాలని, వాస్తవ సంఘటనల్ని ప్రతిబింబించాలని యాజమాన్యం నిబంధన విధించింది. వరహాల్రాజు కథ గురించి ఒక్కరోజల్లా ఆలోచించాడు.*